


# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఏప్రిల్ 14, 2026 | సంపుటి : 2 | సంచిక : 183 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## ఆ బిల్లు 21వ శతాబ్దంలో

### అతి ముఖ్యమైన నిర్ణయం: ప్రధాని మోదీ



పేజీ 2లో

- చారిత్రాత్మక నిర్ణయం: మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దంలో భారత్ తీసుకుంటున్న అత్యంత ముఖ్యమైన నిర్ణయాల్లో ఒకటిగా ప్రధాని అభివర్ణించారు.
- అమలు గడువు: ఈ బిల్లును 2029 నాటికి అమలు చేయాలని, ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో దీనికి సంబంధించి కీలక అడుగులు పడనున్నాయని వెల్లడించారు.
- మహిళా సాధికారత: సామాజిక న్యాయం కేవలం నినాదానికే పరిమితం కాకూడదని, అది పనిసంస్కృతిలో భాగం కావాలని ఆయన ఆకాంక్షించారు.
- ఆస్తి హక్కులు: గతంలో ఆస్తులన్నీ పురుషుల పేరు మీద ఉండేవని, కానీ 'పీఎం ఆవాస్ యోజన' ద్వారా ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేశారు.

## అది రాజ్యాంగంపై దాడి

### కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ



మహిళా రిజర్వేషన్ల బిల్లు కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఆ పార్టీ పార్లమెంటరీ చైర్ పర్సన్ సోనియా గాంధీ అన్నారు. లోక్ సభలో సీట్లు పెంచేందుకు చేపట్టిన పునర్విభజన ప్రక్రియను రాజ్యాంగంపై చేస్తోన్న దాడిగా అభివర్ణించారు. అంతేగాక, ఎన్నికల సమయంలో 'నారీ శక్తి వందనం అధినియమ్' సవరణ బిల్లును తీసుకురావడంపైనా ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. "రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై కేంద్రం తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనలపై చర్చించేందుకు పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక సమావేశం ఏర్పాటు చేయాలి. పేజీ 2లో ▶

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

### హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన రామ్మోహన్



శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేశామని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. 2లో..

## దోపిడీ సొమ్ము నుంచి వైకాపా పుట్టింది: ప్రత్తిపాటి



2లో..



## మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

### ఇందులో బిజెపి రాజకీయ కుట్ర దాగి ఉంది

- పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ
- జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు
- ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు?
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి
- 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి
- జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు
- 50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో ఎందుకు చెప్పడం లేదు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారంమహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు.



2లో ▸

## రాష్ట్రపతితో మంత్రి నారా లోకేశ్ భేటీ

దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు.





## తితిదేకు రూ.1.01 కోట్ల విరాళం

తిరుమల: తితిదేకు ఓ సంస్థ భారీ విరాళాన్ని అందించింది. హైదరాబాద్‌కు చెందిన వర్మ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రూ.1,01,01,116 విరాళంగా అందించారు. తితిదే శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు ఈ మొత్తాన్ని అందించారు.

## భద్రతపై ప్రత్యేక దృష్టి

### ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు ఉండరాదు

### ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న బండి సంజయ్

నాసిక్‌లో జరిగిన 'లవ్ జిహాద్' ఆరోపణల కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు, వేధింపులు, రహస్య నెట్‌వర్క్‌ల ప్రభావం ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్‌లో లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు ఉన్నందున వారి పని వాతావరణం కేవలం కెరీర్ అభివృద్ధికి మాత్రమే పరిమితం కావాలని పేర్కొన్నారు.



2లో..

## కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు జారీ చేశారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు అంశంపై బీఆర్ఎస్ సోషల్ మీడియాలో నిరాధర ఆరోపణలు చేశారని అందులో పేర్కొన్నారు. తన ప్రతిష్ఠను దెబ్బతీశారని చెప్పారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ దుష్ప్రచారానికి కేసీఆర్‌దే బాధ్యత అని పేర్కొన్నారు. 48 గంటల్లో పోస్టులు తొలగించి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## శవరాజకీయాలుల్లో జగన్ దిట్ట

### తండ్రి చనిపోతే సిఎంకోసం పైరవీలు

### మంత్రి అచ్చన్నాయుడు విమర్శలు



2లో..

శవరాజకీయలు నెరపడంలో జగన్ దిట్ట అని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు.

## ప్రాథమిక వ్యవసాయ సంఘం యాసంగి 2025/26 సంవత్సరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన

- వెల్దుర్తి తాసిల్దార్ శ్రీనివాస్
- వ్యవసాయ శాఖ అధికారిని ఝాన్సీ

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 13**



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాలలో సోమవారం నాడు ప్రాథమిక వ్యవసాయ శాఖ సంఘం యాసంగి వరి ధాన్య కేంద్రాలను ప్రారంభించిన వెల్దుర్తి తాసిల్దార్ శ్రీనివాస్ వ్యవసాయ శాఖ మండలఅధికారిని ఝాన్సీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు వెల్దుర్తి మండల వ్యాప్తంగా వరి ధాన్య కేంద్రాలను పలు గ్రామంలో ప్రారంభించడం జరిగిందని సోమవారం నాడు ప్రారంభించిన గ్రామాలు దామరంచ కుకునూర్ జలాల్పూర్ మానేపల్లి మంగలపర్తి ఉప్పులింగాపూర్ నెల్లూరు మాసాయిపేట్ అచ్చంపేట తో పాటు హాస్తాల్ పూర్ గ్రామాలలో వారిగా కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని వారు తెలియజేశారు ఏ గ్రేడ్ రకానికి 23 89 రూపాయలను సాధారణ రకం 23 69 రూపాయలను ఇవ్వడం జరుగుతుందని వడ్లలో తేమ 17.0 శాతం మించడానికి చిత్తతాలు 1.0% మట్టి రాళ్లు 1.0% చెడిపోయిన రంగు మారిన మొలికెత్తిన ధాన్యం 5.0% పూర్తిగా తయారు కాని ములుచుకుపోయిన ధాన్యం 3.0% తక్కువ రకము విషమము 6.0% ఉండాలని అలాంటి సరసమైన వారి ధాన్యాన్ని తీసుకోవడం జరుగుతుందని రైతులు వారి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చినప్పుడు పొలం పాస్ బుక్కు కొత్తది బ్యాంక్ పాస్ బుక్కు ఆధార్ కార్డు జిరాక్స్ చేసిన టోకెన్స్ తప్పనిసరిగా ఒకరివే ఉండాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో హాస్తాల్ పూర్ గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్ మాజీ సర్పంచ్ పాండురంగం చారి డాక్టర్ తిరుపతిరెడ్డి ప్రాథమిక సహకార సంఘం సీఈవో అశోక్ సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు

## రోడ్డు నియమా నిబంధనలను పాటించి వాహనాలను నడపాలి

- ఆరెగూడెంగ్రామ సర్పంచ్ చైతన్య హనుమంత్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 13**



ప్రజలభాగస్వామితోనే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆరెగూడెం గ్రామ సర్పంచ్ చైతన్యమంతరెడ్డి తెలిపారు సోమవారం గ్రామంలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన పోలీస్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం లో వారు పాల్గొని మాట్లాడారు.ప్రతి వాహనదారుడు హెల్మెట్లు ధరించి రోడ్డు నియమా వాళ్ళని పాటించి వాహనాలను నడపాలని సూచించారు. వాహనాలు నడిపి ప్రతి వ్యక్తికి లైసెన్సులు ఇన్సూరెన్సులు కలిగి ఉండాలని విచ్చలవిడిగా ఇష్టాను రాజ్యంగా వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలతో పాటు ఇతర నష్టం జరిగి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఈ అనర్ధాలుజరుగుతున్నాయన్నారు గ్రామంలో అనంతరం శ్రమదానం నిర్వహించారు

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కానిస్టేబుల్ లక్ష్మణ్ గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు అనంతరం ఆరెగూడెం సర్పంచ్ చైతన్య హనుమంత రెడ్డి మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలి అంటే గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని అందరి సహకారంతో మన ఆరోగ్యం కూడా గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చెందే విధంగానే అందరం కృషి చేయాలని వారు తెలిపారు గ్రామంలోని ముఖ్యంగా మురికి కాలువలు సిసి రోడ్లు పనులు చేయవలసి ఉన్నాయి వాటిని త్వరలోనే పనులను చేపట్టే విధంగానే తాను గ్రామం పరిపాలన సాగిస్తారని గ్రామస్తులందరూ ఐక్యమత్యంగా ఉంటూ తనకు సహకారం అందిస్తే మన చిన్న గ్రామపంచాయతీని ఎంతో అభివృద్ధి చేసుకొనే విధంగా ప్రయత్నం చేస్తున్నానని గ్రామం అభివృద్ధి చెందాలి అంటే పార్టీ ల ప్రస్తావన తీసుకురాకుండా మన గ్రామం అభివృద్ధి కోసమే అందరం కృషి చేయాలని పత్రిక ముఖంగా తెలియజేస్తున్నానని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రైతులు యువకులు, పలు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ కపట నాటకం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, శ్రీనివాసరావు విమర్శ

మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ ప్రభుత్వం కపట నాటకం ఆడుతుందని సిపిఎం నేతలు మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చర్చ చేస్తుందని ఆగ్రహించారు. 2023లోనే చట్టం అయినప్పుడే 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టాన్ని అమలు చేయాలని సిపిఎం కోరిందని తెలిపారు. అప్పుడు డిలిమిటేషన్, సీట్ల పెంపుదల, సెన్సస్ అయిన తరువాత అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం మాయమాటలు చెప్పిందని తెలిపారు. కానీ ఇప్పుడు అవేమి జరగకపోయినా మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ కోసం 3రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహించారు. బిల్లుకి మద్దతు ఇవ్వాలని ప్రధాని మోడీ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు లేఖ రాయడం నాటమని తెలిపారు. రాష్ట్రాల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోకుండా, కేంద్రం నిర్ణయాలను అమలు చేయాలని ఏకపక్ష వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. డిలిమిటేషన్ ను జనాభా ప్రాతిపదికన కాకుండా సీట్ల పెంపుదలను బట్టి అమలు చేయాలని అనేక రాష్ట్రాలు ప్రతిపాదించాయని తెలిపారు. డిలిమిటేషన్ తో సంబంధం తేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

మొదటి పేజీ తరువాయి

సోమవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మత్రులు, ఎంపిలు, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు..పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్దమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళలనాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకురిజర్వేషన్లుతీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు..బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలోమహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళారిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయొచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ రిజర్వేషన్లను ఆర్నెల్లలోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ పక్రియ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది,దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు? సీట్లు 50 శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పాడు? 50శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం ఏర్పడుతుంది. దక్షిణాదిపై చూపుతున్న వివక్షతో దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా వ్యవహరిస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి.. పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టడం అన్నట్లుగా ఉంది. దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి. దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతారని అన్నారు. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా

పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంల మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి, ఎంపిలు రఘురామిరెడ్డి, మల్లు రవి, సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలంటే బిజెపికి చిన్నచూపు

**15మంది బిజెపి అధ్యక్షులు మారినా..మహిళలకు చోటేది**

**ముఖ్య పదవుల్లో కూడా మహిళలకు చోటవివ్వని బిజెపి**

**కాంగ్రెస్‌లో ఇందిర, సోనియాలు అధ్యక్షులుగా పనిచేశారు**

**బండి సంజయ్ విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలి**

**మీడియా సమవేశంలో సిఎం రేవంత్ రెడ్డి చురకలు**

సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యం అంటూ.. వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని గుర్తు చేశారు. నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరని అన్నారు. ఇకపోతే ఇప్పటివరకు15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగింది.. కాని ఇప్పటివరకు భారతీయజనతా పార్టీ అధ్యక్షురాలి గా ఒక్క మహిళ నియామకంజరగలేదని సిఎం రేవంత్ చురకలంటించారు. బీజేపీకి మహిళ పట్లగౌరవం, చిత్తశుద్ది ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా.. అని ప్రశ్నించారు. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలుదక్షణాది రాష్టాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం.. అన్నారు. మా ఎంపీలు తెలంగాణను సాధించారు.. ఇప్పుడు పునర్విభజన పైన కూడా పోరాడుతారని సిఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తాం అని అన్నారు. పార్లమెంట్ లో బిల్లును ఎలా ఆమోదిస్తారోచూస్తాం.. 60యేళ్లలోమహిళల కోసం కాంగ్రెస్ పార్టీ చాలా చేసింది..46యేళ్లలో ఒక్క మహిళను పార్టీ అధ్యక్షురాలిని బీజేపీచేయలేదు.. జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్పదవి కూడా ఇవ్వలేదన్నారు. మహిళలను చిన్న చూపు చూడటమే బీజేపీలక్షణం.. ద్వితీయ శ్రేణి పౌరులుగా మహిళలను చూస్తున్నారు..స్వాతంత్యం తెచ్చింది, రాజ్యాంగాన్ని తెచ్చింది, రిజర్వేషన్లుకల్పించింది కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్ దే.. అన్నారు.

యాభై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మోదీ ఇంటి ముందు బంట్రోతు లుగానిలబడాల్సివస్తుంది.. వాళ్ల అవసరం ఇక ముందు ఉండదన్నారు. అన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు కుదీనిపైన లేఖ రాస్తానని సిఎం రేవంత్ అన్నారు. గతంలోనియోజకవర్గాలపునర్విభజన మూడు సార్లు జరిగింది.. 1967 లో 520సీట్లకు పెంచారు,1976 లో 542సీట్లకుపెంచారు..తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి 543 కి పెరిగింది.. 2001 లో వాజ్ పేయి పునర్విభజన పైన చట్టసవరణ చేశారు. దాని వల్ల 2009 లో తెలంగాణకు17 ఎంపీ సీట్లు , ఆంధ్రాకు25 ఎంపీ సీట్లు వచ్చాయి...తెలంగాణ కు 119 అసెంబ్లీ సీట్లు, ఎపీకి175శాసన సభ సీట్లు పెరిగాయి.. స్థూల ఉత్పత్తిలోఅత్యధికంగాభాగస్వామ్యం చేస్తున్న రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి.. ఈశాన్య రాష్టాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభాప్రాతిపాదికన సీట్లు లేవు.. 100 శాతం జనాభాప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు.. ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారని సిఎం గుర్తు చేశారు.

# ఆ బిల్లు 21వ శతాబ్దంలో

### అతి ముఖ్యమైన నిర్ణయం: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

భారత సరికొత్త చరిత్ర లిఖించడానికి అతి చేరువలో ఉందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈ 21వ శతాబ్దంలో అతి పెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు (ఔశీఎవఅం =వంవతీజుఖఅశీఅ దీఅశ్రీశ్రీ)ను ఉద్దేశించి సోమవారం దిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారు. మహిళల రిజర్వేషన్ల బిల్లు అత్యావశ్యకం. సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోంది. ప్రతి పార్టీ దీన్ని ముందుకు తీసుకెళ్లాలి. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి. ఈ నిర్ణయం మహిళా శక్తి, గౌరవానికి అంకితం. దేశ పార్లమెంట్ ఒక కొత్త చరిత్రను సృష్టించేందుకు దగ్గర్లో ఉంది. సమానత్వంతో కూడిన భారతదేశానికి ఇదొక తీర్మానం. ఇక్కడ సామాజిక న్యాయం నినాదానికే పరిమితం కాదు. అది మన పనిసంస్కృతిలో ఒక భాగం. రాష్ట్ర శాసనసభల నుంచి దేశ పార్లమెంట్ వరకు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే సమయం ఆసన్నమైంది. ఆ సమయం ఏప్రిల్ 16, 17, 18" అని మోదీ వెల్లడించారు.

"గతంలో ఇళ్లు పురుషుల పేర్ల మీదే ఉండేవి. భూమి, దుకాణం, కారు.. ఇలా ఏది చూసుకున్నా మగవాళ్ల పేరుమీదే ఉండేవి. అదంతా సహజమనే భావన ఉండేది. మేం పీఎం ఆవాస్ యోజన తీసుకువచ్చాం. దానికింద మహిళ పేరు మీదే ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు మేం ప్రాధాన్యం ఇచ్చాం" అని అన్నారు. ఇలా మహిళా సాధికారత కోసం తీసుకువచ్చిన పథకాల గురించి ప్రస్తావించారు. తాను కుటుంబ జీవితాన్ని జీవించకపోయినా.. ఆ వ్యవహారాలపై అవగాహన ఉందని ప్రధాని సరదాగా వ్యాఖ్యానించారు.

## అది రాజ్యాంగంపై దాడి

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రతిపాదన గురించి ప్రతిపక్షం ఒకసారి కాదు ఇప్పటికే మూడు సార్లు కేంద్రానికి లేఖ రాసింది. అయినా అందరికీ ఉపయోగపడే ఈ అభ్యర్థనను ప్రధాని తిరస్కరించారు. దానికి బదులుగా ప్రధానమంత్రి సంపాదకీయాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, ఇతర సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. నిర్ణయాలు తీసుకునే విషయంలో 'నా మాటే నెగ్గాలి' అన్నట్టు ప్రధాని వ్యవహరించడం విచారకరం. రాజకీయ లబ్ధి కోసమే ఎన్నికల వేళ ఈ అంశాలపై కేంద్రం పార్లమెంట్‌లో చర్చ చేపట్టాలని చూస్తోంది" అంటూ సోనియా గాంధీ విమర్శలు గుప్పించారు.

రాజ్యాంగాన్ని నాశనం చేయడమే భాజపా లక్ష్యం

"లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళా ఎంపీలకు 33 శాతం సీట్లు కేటాయించాలనే ఆలోచనను ప్రతిపక్షం వ్యతిరేకించడం లేదు. 2027 జనాభా లెక్కలకు ముందు జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మాత్రమే వ్యతిరేకిస్తున్నాం. అస్పష్టంగా అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడం మంచి పద్ధతి కాదు. 'నారీ శక్తి వందన అధినియమ్' సవరణ బిల్లును ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరిగే ప్రత్యేక సమావేశానికి బదులుగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశంలోనే తీసుకురావాలి" అని సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

మొదటి పేజీ తరువాయి

గతంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.

## దోపిడీ సొమ్ము నుంచి వైకాపా పుట్టింది: ప్రత్తిపాటి

మొదటి పేజీ తరువాయి

అమరావతి: అభివృద్ధి, సంక్షేమానికి తెదేపా మార్గదర్శిగా నిలిచిందని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. దోపిడీ సొమ్ము నుంచి వైకాపా పుట్టిందని ఆక్షేపించారు. అవినీతి చేసేందుకే జగన్ సీఎం అయ్యారని విమర్శించారు. తెదేపా సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. అవినీతిపరుడైన జగన్‌తో చంద్రబాబు పోరాడాల్సి రావడం బాధాకరమన్నారు. రాజధాని అవసరం లేదనే నాయకుడు కూడా ప్రజలకు అవసరం లేదన్నారు.

## శవరాజకీయాలుల్లో జగన్ దిట్ట

మొదటి పేజీ తరువాయి

జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆనాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా.. ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై

అబద్దాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజమెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే గతి పడుతుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## భద్రతపై ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి బండి సంజయ్ కొన్ని కీలక సూచనలు చేశారు. అన్ని ప్రధాన ఐటీ కంపెనీల హెచ్‌ఆర్ బృందాలతో తక్షణ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాలని అన్నారు. ఉద్యోగుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ కేసును కూడా దాచిపెట్టకూడదని చెప్పుకొచ్చారు. ఉద్యోగులు కార్యాలయాల్లో స్వేచ్ఛగా, భద్రతతో పనిచేసే వాతావరణం ఉండాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఏ రకమైన ఒత్తిడి, వేధింపులు, దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు ఒంటరిగా ఉండకుండా వారికి తగిన రక్షణ, మద్దతు అందించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఇప్పటికే కార్యాలయాల్లో జరిగిన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ప్రభుత్వం, కంపెనీలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఐటీ కంపెనీల యాజమాన్యాలు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాసిక్ కేసు నేపథ్యంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఐటీ రంగ భద్రతపై చర్చను మరింత పెంచాయని తెలిపారు. ఉద్యోగుల రక్షణ, కార్యాలయాల్లో పారదర్శకత, ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయని పేర్కొన్నారు.

## మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 13**
మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు వర్ధంతి సందంర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు ఈరోజు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శ్రీపాదరావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ప్రజాసేవా భావం, రాజకీయ జీవితంలో చూపిన నిబద్ధత, సాధారణ ప్రజల పట్ల చూపిన మమకారం ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్ కుమార్, హుజురాబాద్ మున్సిపాలిటీ చెర్మెన్ రోంటాల సుహాసిని, మహిళ మండల అధ్యక్షురాలు పుల్ల రాధ, హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల తిరుపతి, 5వ వార్డు కౌన్సిలర్ సొల్లు సునిత, 19వ వార్డు కౌన్సిలర్ గొస్కుల రాజ్ కుమార్, 24వ వార్డు కౌన్సిలర్ నాంపెల్లి శ్రీనివాస్, 14వ వార్డు కౌన్సిలర్ వజ్జెపల్లి వెంకటేష్, 9వ వార్డు కౌన్సిలర్ ఇమ్మడి సమ్మయ్య, 28వ వార్డు కౌన్సిలర్ తాళ్పెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.
అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ లంకదాసరి లావణ్య, జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు, హనుమాన్ టెంపుల్ మాజీ చెర్మెన్ కొలిపాక శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి సదానందం, పంజాల రాంశంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షురాలు గొస్కుల నాగమణి, యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ మేకల రాజ్ కుమార్, సిర్సపెల్లి గ్రామశాఖ అధ్యక్షులు ఆడెపు ఐలయ్య, యండి అలీమ్, సీనియర్ నాయకురాలు సుశీల, కొయల్కార్ బాలాజీ, లంకదాసరి ప్రవీణ్, జుపాక సంపత్, రావుల వెంకట్, సునిత, కల్పన, రాదక్క, యండి రియాజ్, యండి కరీమా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 13**
జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ ఢ పీజీ కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్ ప్రక్రియను ఘనంగా ప్రారంభించారు. సోమవారం (13.04.2026) కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, ఈ కళాశాలలో జాతీయ స్థాయి అర్హతలు కలిగిన, పరిశోధన అనుభవం ఉన్న అధ్యాపకులు సేవలందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఆధునిక బోధనా పద్ధతులను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం అని, ఉన్నత విద్య ద్వారా తమ భవిష్యత్తును బంగారు మార్గంలో





నడిపించుకోవాలని సూచించారు.
డే స్కాలర్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా, బాలురు మరియు బాలికల కోసం ప్రత్యేక హాస్టల్ సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు కూడా ఇక్కడ సులభంగా చదువును కొనసాగించగలరని వివరించారు. అనంతరం కళాశాల అడ్మిషన్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా ఇంటింటికీ చేరుకుని కళాశాల ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ డిగ్రీ ఢ పీజీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధిచేసిన బిజెపి నాయకులు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 12**
బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ఆధ్వర్యంలో పశ్చిమ జోన్ 19వ డివిజన్ రేకుర్తిలో బిజెపి పార్టీ పిలుపుమేరకు అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి విచ్చేసి



రేకుర్తి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహాన్ని మంచినీళ్ళతో శుద్ధి చేసి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పార్టీ పిలుపుమేరకు అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్నామని అన్నారు. అలాగే కుల నిర్మూలన, అంటరానితనం పేదవారి అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేశారని ప్రపంచ మేధావి అని అన్నారు. వారి ఆశయ సాధన కోసం బిజెపి కార్యకర్తలు నాయకులు అనునిత్యం పోరాటం చేయాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అనుసరిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్ రెడ్డి, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, కర్రె అనిల్ సంకటి శ్రీనివాస్ రెడ్డి, గుజ్జ శ్రీనివాస్, గొట్టే ముక్కల వెంకటరమణ, వాసు,దయ్యాల మల్లేశం, ఎం లక్ష్మీరాజం, నరసింహారెడ్డి మధుసూదన్ రెడ్డి, నాంపల్లి శంకర్, గోదరి నరేష్, అన్నాజీ వినీత్, మమత, సుకన్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు

## డంపింగ్ యార్డ్‌పై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు గ్రామ సభ పెట్టండి -- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 13**
హుజురాబాద్ పట్టణంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఉద్యమం రోజురోజుకు ఉధృతమవుతోంది. జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్ష సోమవారం 22వ రోజుకు చేరుకోగా, ఈ దీక్షకు వివిధ వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతోంది. ఈ సందర్భంగా హుజురాబాద్ క్లబ్ సభ్యులు దీక్షలో పాల్గొనగా, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరై వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు 22 రోజులుగా నిరసనలు, దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. డంపింగ్ యార్డ్ కోసం సుమారు 500 ఎకరాల భూమిని సేకరించారని సమాచారం వస్తోందని, వెంటనే ఈ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుడా చైర్మన్ ప్రజలు డంపింగ్ యార్డ్‌కు అనుకూలంగా ఉన్నారని చెబుతున్నారని విమర్శించిన ఆయన, నిజంగా ప్రజల అభిప్రాయం ఏమిటో తెలుసుకోవాలంటే గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా ప్రజల మాట వినాలని సూచించారు. గ్రామ సభలో ప్రజలే వాస్తవ పరిస్థితిని వెల్లడిస్తారని,





ప్రజల అభిప్రాయాన్ని విస్మరించడం తగదని హెచ్చరించారు.
డంపింగ్ యార్డ్ ఏర్పాటు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, దీనివల్ల సుమారు 9 మండలాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం, దుర్వాసనలు, వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.
ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోకపోతే జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే లక్ష మందితో భారీ ధర్నా నిర్వహిస్తామని, డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.
అలాగే తమపై వస్తున్న ఆరోపణలపై కూడా స్పందిస్తూ, తమ ప్రభుత్వం లేదా తమ పాలనలో ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చినట్టు నిరూపిస్తే తాను ఎలాంటి చర్యకైనా సిద్ధమని సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆరోపణలు చేస్తున్న వారు తమ పదవులకు రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదించిన ప్రాంతంలోని ఆలయంలో ఈ నెల 19న నిర్వహించనున్న మల్లన్న పట్నాలు కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ వ్యతిరేకతను తెలియజేయాలని పిలుపునిచ్చారు

## కొనసాగుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం.

**కరపత్రం ప్రతినిధి మాసాయిపేట ఏప్రిల్ 13**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని సోమవారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ఉపాధ్యాయులు మెల్లూరు, పెద్దాపూర్, శంశీరెడ్డి పల్లి,చర్లపల్లి తాండ గ్రామాలను సందర్శించి అక్కడ ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల లో చదువుతున్న విద్యార్థులను గుర్తించి, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలను తెలియజేయడం జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం నుండి సీఎం కిట్ గురించి ఉదయం అల్పాహారము, పాలు, రాగి జావా అందిస్తున్నారని తెలియజేయడం జరిగింది. జూన్ నుండి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ, పదవ తరగతి విద్యార్థులకు ఆగస్టు నుండి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాము అని తెలియజేయడం జరిగింది. సోమవారం నాడు మెల్లూరు బడిబాట కార్యక్రమంలో వెంకటస్వామి, నరసింహారెడ్డి, సునీత, మెల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయురాలు జ్యోతి మరియు శంశీరెడ్డి పల్లి తండా, చర్లపల్లి తండా నందు రాధిక ప్రియదర్శిని, ప్రశాంతి దేవి స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో శుద్ధి కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 13**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోలకాని రాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ శుద్ధి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది.
ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాన్ని ప్రత్యేకంగా శుభ్రపరిచి, అనంతరం పాలతో శుద్ధి చేసి గౌరవప్రదంగా నివాళులు అర్పించారు. పూలమాలలు వేసి, అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించే దిశగా కీలక పాత్ర పోషించిందన్నారు.
అంబేద్కర్ ఆశయాలు అయిన సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ, హక్కుల సాధన, దళితుల అభ్యున్నతి వంటి అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని నాయకులు





పిలుపునిచ్చారు. యువత ఆయన ఆలోచనలను తెలుసుకొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కనుమల్ల గణపతి, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, కోలకాని రాజు, ఉడుగుల మహేందర్, పల్లపు రవి, కొమ్ము అశోక్, ఠాగూర్ రాజేష్, రాకేష్, తూర్పాటి శంకర్, మోతే స్వామి, శనిగరపు రవి, గర్రెపల్లి నిరూప రాణి తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
అలాగే కార్యక్రమం అనంతరం స్థానిక ప్రజలతో కలిసి అంబేద్కర్ ఆశయాలపై చర్చలు నిర్వహించారు.



సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, అంబేద్కర్ చూపిన మార్గమే దేశానికి సుసంపన్న భవిష్యత్తును అందిస్తుందని నాయకులు పేర్కొన్నారు.
జమ్మికుంట పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, ఈసారి కూడా భారీ స్థాయిలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం విశేషమని నిర్వాహకులు తెలిపారు.

## తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం స్కూటీని ఢీకొట్టిన లారీ

### - ప్రమాదంలో దంపతులతో సహా చిన్నారి మృతి

వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూ వీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని తట్టెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.

## నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఏప్రిల్ 14, 2026

# ఇంటర్ ఫలితాల్లో అధిక మార్కులు సంపాదించిన విద్యార్థిని అభినందించిన బిజెపి నాయకులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 13**



జమ్మికుంట పట్టణంలోని 24వ వార్డుకు చెందిన గుంతక్ లక్ష్య అనే ప్రతిభావంతురాలు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో 976 మార్కులు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. సాధారణ కుటుంబ పరిస్థితుల్లోనూ కష్టపడి చదివి ఈ స్థాయి మార్కులు సాధించడం ఆమె పట్టుదల, కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి రాజేష్ ఠాగూర్, పట్టణ కార్యదర్శి రాకేష్ ఠాగూర్ కలిసి లక్ష్యను ఆమె నివాసంలో ప్రత్యేకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. ఆమె తల్లిదండ్రులు గుంతక్ రమేష్, స్వప్నలను కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, కుమార్తె సాధించిన విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. పేదరికాన్ని అడ్డంకిగా భావించకుండా నిరంతరం శ్రమిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని లక్ష్య నిరూపించిందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థాయికి చేరుకుని కుటుంబానికి, సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోతే స్వామి, గర్రెపల్లి నిరూపారాణి, కనుమల్ల లక్ష్మి, ఎండి సర్వర్ తదితరులు పాల్గొని లక్ష్యను ప్రశంసలతో ముంచెత్తారు. స్థానికులు కూడా ఈ విజయాన్ని అభినందిస్తూ, ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 49వ డివిజన్లో హెల్త్ క్యాంపు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 13**






సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 49వ డివిజన్లో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది ఈ క్యాంపులో బీపి, షుగర్ , ఇతరత్రా వ్యాధుల పరీక్షలు నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ పాల్గొని ప్రారంభించారు. వార్డ్ ఆఫీసర్ మెండె శిరీష. డాక్టర్ శ్రీనివాస్, ఏఎన్ఎం భాగ్య, సనాతన ధర్మం సేవా సమితి సభ్యులు భూమ్ రావు, రవికుమార్ నల్ మాచు సంతోష్, లంబు సుధాకర్ రెడ్డి, ముదిగంటి ప్రవీణ్ రెడ్డి, నారోతం రెడ్డి, గాదగోని రమేష్, లావణ్య, మమత, నీలిమ, విజయ, భ్రమరాంబిక తదితరులు దాదాపుగా 60 మంది క్యాంపులో పాల్గొన్నారు. అదేవిధంగా అరైవ్ – అలైవ్ రోడ్ సేఫ్టీ కి సంబంధించిన ప్రతిజ్ఞ కూడా చేయించడం జరిగింది. ట్రాఫిక్ పోలీస్ వారితో కలిసి రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రోడ్ సేఫ్టీ చైర్మన్గా కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ తో పాటు 8 మంది సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.

# ఇంటర్ ఫలితాలు లో తేజస్ జూనియర్ కళాశాల విజయకేతనం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 13**



ఆదివారం వెలువడించిన ఇంటర్ ఫలితాల్లో తేజస్ జూనియర్ కళాశాల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించారు. సోమవారం రోజున విలేకరుల సమావేశం నిర్వహించి చైర్మన్ సతీష్ రావు మాట్లాడుతూ అత్యుత్తమ కనబరిచిన విద్యార్థులకు బొకేలతో సత్కరించారు. ఎం.పి.సి. మొదటి సంవత్సరంలో ఏ. కార్తికేయ 470 మార్కులు కి 467 , బి. నివేదన్ 467, పి. సాయి చరణ్ 466, బి. నితిన్ 466, బి. సాయి తేజ 465, కె. నంద కిషోర్ 465,సిఈసి మొదటి సంవత్సరంలో వి. శ్రీ చేతన్ 500 మార్కులు కి 483 , ఎం. వంశీ నాయక్ 478 , సి.హెచ్. వరుణ్ తేజ 475 ,బై.పీ.సీ మొదటి సంవత్సరంలో పి. ఆదిత్య నాయక్ 440 మార్కులు కి 426 ,ఎం.పి.సి. ద్వితీయ సంవత్సరంలోఏ. శ్రీవర్ధన్ 1000 మార్కులు కి 993,బి. రిషిత యాదవ్ 992, ఏ .నందీశ్వర్ రెడ్డి 992, ఎం. వర్షిత్ 992,సిఈసి ద్వితీయ సంవత్సరంలో బి. రామ్ చరణ్ 1000 మార్కులకు 972, వై. నవదీప్ 969, జి. రాజేందర్ 968,బైపిసి ద్వితీయ సంవత్సరంలో ఆర్. జగన్ 1000 కి గాను 954 మార్కులు సాధించడం జరిగింది. అదేవిధంగా జూన్ లో జరిగే ఆర్మీ ,నేవీ, నోటిఫికేషన్ లలో తేజస్ విద్యార్థులు అత్యధికంగా ఉద్యోగాలు సాధించే విధంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని చైర్మన్ సతీష్ రావు తెలిపారు

# సీనియర్ జర్నలిస్ట్ కెపి రామస్వామి సార్ కు ఘన నివాళి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 13:**



గోదావరిఖని ప్రెస్ క్లబ్ వ్యవస్థాపకులు సీనియర్ జర్నలిస్ట్ కె.పి రామస్వామి సార్ 24వ వర్ధంతి సందర్భంగా ప్రెస్ క్లబ్ ఘనంగా నివాళులర్పించింది. 'గని కార్మికుల గోస' వార్తలతో కార్మికులను చైతన్యపరిచాడని, సార్ వార్త రాయడమే కాదు అవసరమైతే బాధితుల పక్షాన, కార్మికులకు అండగా నిలిచిన గొప్ప నాయకుడని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి.మాధవరావు, గడ్డం శ్యామ్ కుమార్, కోశాధికారి టి రాజ్ కుమార్, సీనియర్ జర్నలిస్టులు పందిళ్ళ శ్యామ్ సుందర్, దయానంద్ గాంధీ, జీవన్ బాబు, తగరపు శంకర్, డి శేఖర్, సిరిమల్ల మధు, కెపి శ్రీనివాస్, దబ్బెట శంకర్, బొల్లం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి" సందర్భంగా పత్తి మార్కెట్కు సెలవు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 13**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద రెండవ వ్యవసాయ మార్కెట్గా పేరుగాంచిన పత్తి మార్కెట్కు "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి" సందర్భంగా సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు.

భారత రాజ్యాంగ నిర్మాత, మహానుభావుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించిన నేపథ్యంలో, మార్కెట్ యార్డు కూడా ఆ రోజు పూర్తిగా మూసివేయబడుతుందని ఆమె పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా ప్రాముఖ్యత వంటి విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించాల్సినవని ఈ సందర్భంగా ఆమె



గుర్తుచేశారు.

ఈ సందర్భంగా సమస్త రైతు సోదరులు, అడ్తీలు, పత్తి కొనుగోలు వ్యాపారులు, గుమస్తాలు, హమాలీలు, దాడువాయి కార్మికులు, ట్రాక్టర్ మరియు ట్రాలీ డ్రైవర్లు గమనించవలసిందిగా కోరడమైనది. రైతులు దూర ప్రాంతాల నుండి మార్కెట్కు వస్తుండటంతో, ముందస్తుగా ఈ సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను సక్రమంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

తేది 14-04-2026 (మంగళవారం) రోజున మార్కెట్ పూర్తిగా మూసివేయబడును. తిరిగి 15-04-2026 (బుధవారం) రోజున మార్కెట్ యథావిధిగా పునఃప్రారంభమగును. ఆ రోజున సాధారణ లావాదేవీలు, పత్తి కొనుగోలు-- అమ్మకాలు, వేలం ప్రక్రియలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

కావున రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను పై పేర్కొన్న సెలవు రోజున మార్కెట్ యార్డుకు తరలించవద్దని, అనవసర ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ విజ్ఞప్తి చేసింది. మార్కెట్ యార్డు వద్ద రద్దీని నివారించేందుకు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలని కోరారు.

అదేవిధంగా, మార్కెట్ పునఃప్రారంభమయ్యే 15వ తేదీ నుండి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, తూకం కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రతపై గ్రామ సభ నిర్వహణ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 13**





కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గంగ్రపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా "అరైవ్ అలైవ్" మండేటెడ్ షెడ్యూల్ కింద రోడ్డు సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో జమ్మికుంట మండలంలో మొదటగా గంగ్రపల్లి గ్రామంలో గ్రామ సభను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమ్మికుంట పట్టణ సిఐ హాజరై, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని యువత మరియు ప్రజలు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

ప్రస్తుతం యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతున్న నేపథ్యంలో, వాటికి దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని ఆయన హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, అలాంటి చర్యలు తమ ప్రాణాలకు మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ప్రమాదాలను తప్పించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడం లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట కవిత లక్ష్మణ్, ఉప సర్పంచ్ మ్యాక బీరేందర్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాము, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో గ్రామ ప్రజలు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం కోసం సహకరించాలనే సంకల్పంతో ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# జమ్మికుంట తహసిల్దార్ ఆఫీస్ లో ప్రజావాణి కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 13**



జమ్మికుంట తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మొత్తం 4 దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ నల్ల వెంకటరెడ్డి తెలిపారు. అందులో నాలుగు దరఖాస్తులు కూడా భూమి సమస్యలకు సంబంధించినవేనని ఆయన వివరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశంగా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని తహశీల్దార్ పేర్కొన్నారు. భూమి వివాదాలు, పట్టాదారు సమస్యలు, రికార్డుల సవరణలు వంటి అంశాలపై వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ప్రతి సోమవారం నిర్వహించే ఈ ప్రజావాణి కార్యక్రమానికి గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతుండటం గమనార్హం. సమస్యల పరిష్కారంలో ఆలస్యం లేకుండా ఉండేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ప్రజలు సమర్పించే దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సమగ్రంగా పరిశీలించి, న్యాయపరమైన పరిష్కారాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అవసరమైన పత్రాలు సమర్పిస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని సూచించారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజల వినతులను స్వీకరించి, సంబంధిత వివరాలను నమోదు చేశారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా కృషి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా పరిపాలన చేరువవుతుందని, భవిష్యత్తులో కూడా ఈ విధంగా ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత వేగం తీసుకురావాలని అధికారులు సంకల్పం వ్యక్తం చేశారు.

# జమ్మికుంట పట్టణంలో శ్రీపాదరావుకు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 13**




జమ్మికుంట గాంధీ చౌరస్తాలో మంథని మాజీ శాసనసభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుదిల్ల శ్రీపాదరావు రావు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి శాసనసభ స్పీకర్గా ఎదిగిన శ్రీపాదరావు ఈ ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, న్యాయపరమైన తీరు, సాధారణ ప్రజల సమస్యలపై చూపిన శ్రద్ధ నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తూ ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అదేవిధంగా, రాజకీయాల్లో ఆయన చూపిన మార్గదర్శకత్వం ఎంతోమందికి దిక్సూచిగా నిలిచిందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఆయన పాత్ర విశిష్టమని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలువురు సదయ్య, కౌన్సిలర్లు మాచర్ల రాజు, యాట్ల సునీత, అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సలీం, ఎండి సజ్జు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎగ్గని శ్రీనివాస్, సలీం పాషా, పాత ప్రసాద్, చిన్నింటి నాగేంద్ర, ఆడెపు కిరణ్, చంచల శ్రీనివాస్, రాజ్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# శవరాజకీయాలుల్లో జగన్ దిట్ట తండ్రి చనిపోతే సిఎంకోసం పైరవీలు

– మంత్రి అచ్చన్నాయుడు విమర్శలు

శవరాజకీయలు నెరపడంలో జగన్ దిట్ట అని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆనాడు జగన్కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా.. ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై అబద్ధాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజమెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే గతి పడుతుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.